ప్రార్థనలు ప్రశాంతం



శాస్త్రీపురం: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల ప్రార్థనలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, చింతల్‌మెట్, వాదియా మహ్మద్‌కాలనీ, ఖయంనగర్, నౌ నంబర్, ఎంఎం పహాడీ, దానమ్మ జోపిడి ప్రాంతాలలో ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12కు ప్రారంభమైన ప్రార్థనలు 3 గంటల వరకు కొనసాగాయి. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలోని మసీదుల వద్ద అత్తరు సీసాల, ఖురాన్, ముస్లిం మతానికి చెందిన పవిత్ర పుస్తకాల విక్రయాలు జోరుగా కొనసాగాయి. పలుచోట్ల వీటితో పాటు దుస్తులను కూడా విక్రయించారు. శుక్రవారం ప్రార్థనల సందర్భంగా అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లోని మసీదుల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచడం లేదని రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ చౌరస్తాలో శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీల్లో పని చేస్తున్న అన్ని రంగాల కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు రూ. 26 వేలు అమలు జరుగుతాయని కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికుల సమస్యల మీద కనీస వేతనాల మీద మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, నరసింహా, రమేశ్, ఇందిరమ్మ, శాంతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లిస్తామంటే మోసపోవద్దు

జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి

మణికొండ: జలమండలి నీటి కనెక్షన్‌లను ఇస్తామని ఓ ముఠా ప్రజలను మభ్యపెట్టి డబ్బులు దండుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి మణికొండ డివిజన్ మేనేజర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎలాంటి కనెక్షన్ అనుమతులు లేకుండా అనధికారికంగా వారు కనెక్షన్‌లు ఇస్తున్నట్టు తెలిసిందన్నారు. అలాంటి కనెక్షన్లను గుర్తించి రాబోయే రోజుల్లో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, ప్రజలు అలాంటి వారి జోలికి వెళ్లకుండా ఎవరికైనా కనెక్షన్ కావాలంటే జలమండలికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటం, కార్యాలయంలో తమను సంప్రదించాలని కోరారు. ప్రజలను మభ్యపెడుతున్న వారిని గుర్తించామని త్వరలో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

వామ్మో.. హైదర్‌గూడ చౌరస్తా..!

- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- కొరవడిన ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ
- ఆందోళనలో పాదచారులు, వాహనదారులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. చెత్తాచెదారం.. ఇతర వ్యర్థాలతో నిండి డంపింగ్ కేంద్రంగా మారితున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రధాన రహదారి నుంచి వెళ్లే రోడ్డు మార్గంలో స్థానికంగా ప్రయాణికుల అవసరాల మేరకు ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆటో స్టాండ్ సమీపంలో ట్రాఫిక్ నిబంధనలు, ఆంక్షలు తెలిపేందుకు అధికారుల కోసం ప్రత్యేకంగా స్టాండ్ నిర్మించారు. ట్రాఫిక్‌కు నిత్యం అంతరాయం కలుగుతుందని ఉద్దేశంతో ఈశ్వర్ థియేటర్ ప్రాంతంలో యూటర్న్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ అధికారుల కోసం ఏర్పాటు చేసిన స్టాండు నిరుపయోగంగా మారిపోయింది.

- ఆటో స్టాండ్ పరిసర ప్రాంత్తాల్లో కూడా మట్టి, చెత్తను డస్ట్‌ను తొలగించక పోవడంతో ద్విచక్ర వాహనాదారులు జారి కిందపడిపోతూ ప్రమాదాల బారినపడుతున్నారు. నగరంలో, నగర శివారులో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలకు వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం ఉదయం 7 గంటల నుంచి వారికి సంబంధించిన బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.



మట్టితో హైదర్‌గూడ ప్రధాన చౌరస్తా



ట్రాఫిక్ సిబ్బంది లేక ఖాళీగా ఉన్న స్టాండ్

- కళాశాలకు లేటు అవుతుందేమోనని విద్యార్థులు, ఉద్యోగులు హడావిడిగా కనిపిస్తుంటుంది. విధి నిర్వహణలో ట్రాఫిక్ సంబంధిత అధికారులు లేకపోవడంతో సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించిన వాహనాలు శరవేగంతో వెళ్తూ ప్రమాదాలు తెచ్చి పెడుతున్నాయి. ఇటీవల అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళా ఫార్మసిస్ట్ హైటెక్ సిటీలో ఉన్న కంపెనీకి వెళ్లేందుకు పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే 130 పిల్లర్ సమీపంలో తన తండ్రితో కలిసి రోడు దాటుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గాయపడి కోమాలోకి వెళ్లింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోజూ అత్తాపూర్, హైదర్‌గూడ చౌరస్తాల్లో ట్రాఫిక్ అధికారుల పర్యవేక్షణ ఉండాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పేరుకుపోయి చెత్తాచెదారం

పైప్‌లైన్ సామర్థ్యాన్ని పెంచండి

మణికొండ: దశాబ్దాల కాలం క్రితం అప్పటి జనాభా అవసరాలకు అనుగుణంగా నిర్మించిన మంచినీటి పైప్‌లైన్ ఇప్పటికీ కొనసాగిస్తుండటంతో నీరు ఏమాత్రం సరిపోవటం లేదని, దాని సామర్థ్యాన్ని పెంచి సరిపడా నీటిని సరఫరా చేయాలని మణికొండ క్వార్టర్స్ నాయకులు అధికారులను కోరారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ (క్వార్టర్స్) కాలనీ వాసులు భానుచందర్, హుస్సేన్, దీపక్‌సింగ్‌లు శుక్రవారం జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ కాలనీలో 1987లో వేసిన 4 ఇంచుల పైప్‌లైన్ ఉందన్నారు. అప్పట్లో గ్రౌండ్ ఫ్లోర్‌గా ఉన్న గృహాలు ఇపుడు అపార్ట్‌మెంట్‌లుగా అభివృద్ధి చెందాయన్నారు. అయినా అదే స్థాయిలో నీటి సరఫరా చేయటంతో ప్రజలకు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాని సామర్థ్యం పెంచాలని కోరారు. పలు మార్లు ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం అధికారులైనా పనులను చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో భరత్, దీపక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న క్వార్టర్స్‌వాసులు

రేడియల్ రోడ్డు పనులు పూర్తి చేయాలి



కాలనీలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: షేక్‌పేట నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకునేందుకు చేపట్టిన రేడియల్ రోడ్డు-5ను వెంటనే పూర్తి చేసి మణికొండ వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నగర్ కాలనీలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రేడియల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవటంతో ప్రజలు అనేక రోడ్ల ద్వారా ప్రయాణించటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. కాలనీ పక్కనే జనావాసాలకు ఆనుకుని రెడీ మిక్స్ ప్లాంట్ కొనసాగుతుండటంతో దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యాలు ఏర్పడుతున్నాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. లేబర్ గుడిసెలు వేసి రెవెన్యూ మ్యాప్‌లో ఉన్న బండ్లబాటను కబ్జా చేయటంతో పుప్పాలగూడ శ్మశాన వాటికకు వెళ్లే దారి మూసుకుపోయిందన్నారు. మంచినీటి సరఫరా సమయాన్ని తగ్గించటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని, రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, శ్రీకాంత్, సుమనళిని, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఉద్యాన' విద్యార్థులు

ఏజీవర్సిటీ: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 పోటీలు ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విశ్వ విద్యాలయం నుంచి నిధిన్ పాటిధార్, తనుచబ్ర, కావ్య ఎంపికయ్యారు. విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల అసోషియేట్ డీన్ ప్రశాంత్ మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన వికసిత్ భారత్ పార్లమెంట్ పోటీలో మొత్తం 10 మంది ఎంపికకాగా అందులో ముగ్గురు ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల చివరి వారంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో జరిగే వికసిత్ భారత్ పార్లమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొటారని తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.రాజశేఖర్, డీన్ పిడగం సైదయ్య, కళాధర్ బాబు, అశ్విన్ కుమార్, మమత, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

బీసీ విద్యార్థుల కృతజ్ఞతా ర్యాలీ

ఏజీవర్సిటీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పెంచిన నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పి.వి నర్సింహారావు పశు వైద్య విద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు సంయుక్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మూడు విశ్వవిద్యాలయాలు తిరుగుతూ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు బీసీల అభివృద్ధికి బాసటగా తెలంగాణ ప్రభుత్వం, రిజర్వేషన్ పెంపుతో బీసీలకు న్యాయం అనే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రిజర్వేషన్ పెంపునకు సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ మంత్రులకు ధన్యావాదలు తెలిపారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. బీసీల సామాజిక, విద్యా ఆర్థిక అభివృద్ధికి 42 శాతం రిజర్వేషన్ పెంపు ఒక చారిత్రక నిర్ణయమని, ఈ రిజర్వేషన్ పెంపు ద్వారా వెనుకబడిన వర్గాలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి ఈ నిర్ణయం మైలురాయిగా నిలుస్తుందని భవిష్యత్తు కూడా బీసీల సాధికారత కోసం మరిన్ని న్యాయమైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు భిక్షపతి, డాక్టర్ కవిరాజు, సతీష్ లోకేష్, రమేష్, దశరథ్, షరీపుద్దీన్, చెంచు రామయ్య, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ విగ్రహం వద్ద విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు

కవితలు కదిలిస్తాయి



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు

శంషాబాద్: 'మన చుట్టూ ఉన్న వివిధ అంశాలను ముచ్చటైన పదాలతో అల్లే కవితలు మనల్ని కదిలిస్తాయి. భాషపై ఉన్న పట్టును ప్రతిబింబిస్తాయి' అని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు అన్నారు. కళాశాలలో భాషా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ... అసాధారణమైన విషయాలను సైతం అలవోకగా చప్పగలిగే చమత్కారం కవితల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు తమలోని భావాలకు భాషతో పదును పెట్టాలన్నారు. 'లే మొగ్గలు' పేరిట కళాశాలలో కవితల ప్రదర్శించే ఏర్పాటు చేస్తామన్నారు. 'శాంతి ఐక్యత కోసం కవిత ఓ వారధి అనే అంశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రచించిన పలు కవితలను ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.భానుప్రకాష్, అధ్యాపకులు సంగీత, సలీం, డాక్టర్ శ్యామల, మంగళదాస్, డాక్టర్ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాల అరెస్టు

మణికొండ: ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో విక్రయిస్తున్న ముఠాలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌షాకోట్ సన్‌సిటీలో ఉండే జి.వరుణ్‌కుమార్, హైదరాబాద్ నగరంలోని ఎస్ఆర్ నగర్‌లో ఉండే ఎస్.జయంత్‌లు మహారాష్ట్ర నుంచి వాసీమ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి ప్యాకెట్లుగా తయారు చేసి హైదర్‌షాకోట్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాల సమీపంలో విక్రయాలు చేస్తున్నారు. వారిని హైదర్‌షాకోట్ సెక్టార్ ఎస్ఐ ప్రభాకర్ అరెస్టు చేశారు. మరో కేసులో బేగరి శ్రీకాంత్ లంగర్‌హౌస్ ప్రశాంత్‌నగర్‌లో ఉంటూ కోకాపేటలో గంజాయి విక్రయిస్తున్నాడు. అతన్ని కోకాపేట సెక్టార్ ఎస్ఐ మునీందర్ అరెస్టు చేశారు. వీరంతా గతంలో గంజాయి విక్రయాలు చేసి జైలుకు వెళ్లివచ్చారు. అయినా మారకుండా తిరిగి అదే వ్యాపారం చేస్తుండటం, పాఠశాల విద్యార్థులు, లేబర్‌ను టార్గెట్ చేసుకుని విక్రయాలు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. రెండు గ్రూపుల నుంచి మొత్తం 1280 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మరో కేసులో గంజాయిని తెచ్చి పుప్పాలగూడలో విద్యార్థులే టార్గెట్‌గా విక్రయాలు చేస్తున్న శ్రీకాంత్‌ను శుక్రవారం రాత్రం పోలీసులు అరెస్టు చేశారు. అతను ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి గంజాయి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారంతో పుప్పాలగూడ సెక్టార్ ఎస్ఐ సరిత అతన్ని అరెస్టు చేశారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ విద్యాసాగర్ మాట్లాడుతూ... ఫ్యాకల్టీ సమయపాలన, నిబద్ధత, వృత్తిపరంగా విజయాలకు దోహదం చేస్తాయన్నారు. ఆర్థిక వనరుల యాజమాన్యం చాలా ముఖ్యమైందని అన్నారు. అధునాతన బోధన పద్ధతులు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

హిమాయత్‌సాగర్‌లో కలుస్తున్న డ్రైనేజీ నీరు

- వాటినే సరఫరా చేస్తున్న అధికారులు
- బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ: డ్రైనేజీలోని మురుగు నీరు కలుస్తున్నా ఆ నీటిని శుద్ధి చేయకుండా ప్రజలకు సరఫరా చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ చెరువులోకి వస్తున్న మురికి, డ్రైనేజీ నీటి వ్యవస్థను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నెల క్రితం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు హిమాయత్‌సాగర్ నుంచి నీటి సరఫరా ప్రారంభించారని గుర్తుచేశారు. శంషాబాద్, సాతంరాయి, గగన్‌పహాడ్ నుంచి వచ్చిన డ్రైనేజీ నీరు హిమాయత్‌సాగర్‌లో కలుస్తున్నాయన్నారు. నెల రోజులుగా సరఫరా అవుతున్న నీరు సరిగ్గా రావడం లేదని సరఫరా అయిన సమయంలో వాసన వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. ఈ నీటి సరఫరా సరిగా జరగకపోవడంతో ప్రజలు ట్యాంకర్లు తెచ్చుకొని తమ అవసరాలను తీర్చుకుంటున్నారన్నారు. ముందుగా బాగున్న చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లపై ఉందన్నారు. గండిపేట్, హిమాయత్‌సాగర్‌లలో మురికి నీరుకలవకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. 111 జీవోను ఎత్తివేసి డ్రైనేజీ నీరు జంట జలాశయాల్లో కలవకుండా చూడాలన్నారు. ఇప్పుడు ప్రభుత్వానికి డబ్బులు కావాలన్నా గండిపేట మండలంలోని భూములు అమ్ముకొని ఖజానా నింపుకుంటారు కానీ గండిపేట మండలానికే నీరు కావాల్సి వచ్చినప్పుడు ట్యాంకర్లు కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకొని హిమాయత్‌సాగర్‌లోకి డ్రైనేజీ నీరు కలవకుండా చూడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



హిమాయత్‌సాగర్ చెరువులోకి కలుస్తున్న డ్రైనేజీ నీరు

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



హైదర్‌గూడ టైనీ స్కాలర్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



హైదర్షాకోట్‌లోని జెడ్‌పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

అత్తాపూర్: పదవ తరగతి పరీక్షలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సజావుగా జరిగినట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్ రాథోడ్ తెలిపారు. 5004 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4983 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 21 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షలకు హాజరుకాలేదన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, సంబంధిత అధికారులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర శుక్రవారం పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భవాని మోడల్ స్కూల్, గౌతమ్ మోడల్ స్కూల్, ఎస్ఎంపీ మోడల్ స్కూల్ హైదర్షాకోట్, ఎల్ఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్ బండ్లగూడలలో మొదటి రోజు పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మణికొండలో ప్రశాంతం...

మణికొండ: పదవ తరగతి పరీక్షలు గండిపేట మండలంలో మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 11 కేంద్రాలలో 2567 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా అందులో ఆరు మంది పరీక్షలు హాజరు కాలేదని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఐదు నిముషాలు ఆలస్యంగా వచ్చిన వారినీ అనుమతించామన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు మంచినీరు తదితర సౌకర్యాలను కల్పించామన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రాజేంద్రనగర్: పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వాహణ సరళిని పరిశీలించారు. వేసవి అయినందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెయిన్ గేట్ వద్ద విద్యార్థినీవిద్యార్థులను వేర్వేరుగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపాలని పోలీసులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఇఫ్తార్ కోసం రూ.70 కోట్లా..?

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు కోసం రూ.70 కోట్లు మంజూరు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్, మాజీ పీసీసీ ఉపాధ్యక్షుడు ఆబిద్ రసూల్ ఖాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇఫ్తార్ కోసం రూ.70 కోట్లు ఖర్చు చేయడం వృథా అని, ఈ మొత్తాన్ని మైనార్టీ సంక్షేమానికి కేటాయించాలని సూచించారు.ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. సదరు నిధులను మైనార్టీ విద్య, వైద్య కళాశాలకు కేటాయిస్తే ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ హర్షిస్తారని, భవిష్యత్ తరాలకు మేలు చేసినవారవుతారని లేఖలో పేర్కొన్నారు.

జాతీయ సదస్సులో సిటీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన పీజీ విద్యార్థుల బృందం వరంగల్‌లో శుక్రవారం జరిగిన ఎన్ఐటీ డైమండ్ జూబ్లీ సదస్సులో పత్ర సమర్పణ చేసింది. రెండు రోజుల పాటు కొనసాగే ఆసెంట్-2025 జాతీయ సదస్సులో సిటీ కాలేజ్ విద్యార్థుల బృందం గ్రీన్ టెక్నాలజీ ఆధారంగా నానో కాంపోజిట్స్‌పై పరిశోధనను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. బాలభాస్కర్ విద్యార్థుల బృందాన్ని అభినందించారు.

6 గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

చాంద్రాయణగుట్ట: ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆయా పథకాలకు అరకొర నిధులు కేటాయించి వాటిని ఎత్తివేసేందుకు పావులు కదుపుతోందని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు కూడా సరిపడా నిధులు కేటాయించలేదన్నారు.